**దివ్యవనాలు - విశిష్టత**
46వ భాగం

సువాసనా భరితం - ఔషధగుణాల చరితం

# మొగలిపువ్వులు


జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com




## సరస్వతీ వనం

(గత సంచిక తరువాయి)



నిత్యానందే నిరాధారే నిష్కళాయై నమో నమః
విద్యాధరే విశాలాక్షి శుద్ధజ్ఞానే నమో నమః॥

శుద్ధస్ఫటికరూపాయై సూక్ష్మరూపే నమో నమః
శబ్దబ్రహ్మి చతుర్హస్తే సర్వసిద్ధ్యై నమో నమః॥

### కేతకీ పుష్పం

కేతకీ పుష్పం అంటే మొగలిపువ్వు. ఈ చెట్టు ఆసియా, ఆస్ట్రేలియా, పసిఫిక్ దీవుల ప్రాంతానికి చెందింది. ఇది సముద్రపు తీర ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తూంటుంది. దక్షిణ భారతదేశం, మారిషస్, ఫిలిప్పీన్స్, మలేసియా, థాయ్‌లాండ్, అండమాన్ దీవుల్లో కూడా ఇది విరివిగా పెరగటం గమనించవచ్చు. ఇది సముద్రతీరాల్లోని ఇసుక తిన్నెల్లో చక్కగా పెరుగుతుంది. బలమైన గాలులను, ఉప్పుగుణాన్ని, కరువు పరిస్థితులను సమర్థవంతంగా తట్టుకొనే శక్తి కలిగి వుంది. అంతే కాకుండా పర్యావరణపరంగా చూస్తే దీని వేర్లు ఇసుకని కొట్టుకొని పోకుండా గట్టిగా పట్టుకొని వుంచుతాయి. దీని కొమ్మలకి వేర్లు వస్తూ ఒక పొదలాగా పెరుగుతుంది. దీనిలో అత్యధికంగా 600 రకాలు వుండటం విశేషం. వీటిలో సుమారు 3 అడుగుల నుంచి 66 అడుగుల ఎత్తు వరకు పెరగగల రకాలు వున్నాయి. అయితే మన ప్రాంతంలోని మొగలిచెట్టు 18 అడుగుల వరకు పెరుగుతుంది.





| | | |
|---|---|---|
| సంస్కృత నామాలు | : | కేతకీ, చామరపుష్ప, దీర్ఘపత్ర, నిపప్రియ రాజపుష్ప, స్థిరగంధ, తీక్షణ పుష్ప మొ॥ |
| శాస్త్రీయ నామం | : | Pandanus odoratissimus |
| ప్రాంతీయ నామాలు | : | మొగలి, గొజ్జంగి, గేదంగి మొగలి |
| ఆంగ్ల నామాలు | : | Screw Pine, Umbrella tree etc. |
| హిందీ నామాలు | : | Kewda, Keora etc. |

#### ఔషధ గుణాలు

* మొగలిఆకులు, పువ్వులు, వేర్లు అన్నీ కూడా ఔషధ గుణాలు కలిగి వున్నాయి.
* ప్రత్యేకించి దీవుల్లోని ఆదివాసులు వీటిని వైద్యపరంగా పలు విధాలుగా వాడటం గమనించవచ్చు.
* ఇది వివిధ చర్మరోగాలు, వాపులను తగ్గిస్తుంది.
* కీళ్ళవాతం, బొల్లి, కుష్టు వంటి మొండి వ్యాధులను నయం చేస్తుందని వీళ్ళ నమ్మకం.
* కాలేయ సంబంధిత వ్యాధులు, గడ్డలు మొదలగు వాటి నిర్మూలనలో ప్రయోగాలు జరుగుతున్నాయి.
* జ్వరం, శ్వాసకోశ రుగ్మతల ఉపశమనానికి కూడా వీరు వాటిని వాడతారు.
* వృక్ష శాస్త్రవేత్తలు దీనిలో మధుమేహం, క్యాన్సర్‌లను నియంత్రించగల రసాయనాలు వున్నట్లు కనుగొన్నారు. అవి ఎంతవరకు వినియోగించవచ్చు అన్న దిశలో పరిశోధనలు జరుగుతున్నాయి.

#### విశేష గుణాలు

**ఆకులు**

* ముదురు ఆకుల అంచుల్లో ముళ్ళు వుంటాయి.




* కొన్ని ప్రాంతాలవారు మొగలి ఆకుల్లో ముళ్ళు తొలగించి, వైనంగా చుట్టి, ఇడ్లీలు ఇంకా ఇతర వంట పదార్థాలను వండుతారు.
* Pandanus amaryllifolius అన్న ఒక్కరకంలో మాత్రమే సువాసన గల ఆకులు వుంటాయి. వీటికి ఇటువంటి గుణం ఉండటం వల్ల అనేక ప్రాంతాల్లో వీటిని సాగుచేయడం జరుగు తోంది. వీటిని బియ్యంతో పాటు వేసి వుడికిస్తారు. బిర్యాని తయారీలో కూడా వీటిని విరివిగా వాడతారు.






* మన ప్రాంతంలో తాటాకులు, కొబ్బరి మట్టలతో ఇల్లు వేసు కున్నట్లే కొన్ని దీవుల్లోని వారు మొగలి మరియు కొబ్బరి ఆకులతో ఇళ్లను నిర్మించుకోవడం గమనించవచ్చు.




* ఆకులను చీల్చి చాపలు, బుట్టలు, టోపీలు వంటి వస్తువులను తయారు చేస్తుంటారు.








* వీటి ఆకులతో కాగితాలను కూడా తయారుచేస్తారు.
* ఈ చెట్టు ఆకులు ఒక 'స్పైరల్' అమరికలో వుంటాయి. ఆకులను కోసిన తరువాత వాటి 'స్పైరల్' ఆకారం సుస్పష్టంగా కనిపిస్తుంది. ఈ కారణం చేతనే ఈ చెట్టుకి ఆంగ్లంలో 'స్క్రూపైన్' అని పేరు పెట్టడం జరిగింది.



**పువ్వులు**

* ఇక పువ్వుల విషయానికి వస్తే, ఆడ, మగ పుష్పాలు వేరువేరు చెట్లపై పూస్తాయి. మనకి పండుగల సమయంలో, వివిధ దేవాలయాలలో దర్శనమిచ్చే సువాసనాభరిత పువ్వులు మగపుష్పాలు. వీటి సుగంధ ద్రవ్యసేకరణ గురించి మరింత విపులంగా వచ్చే సంచికలో తెలుసుకుందాం.
* ఇక ఆడపుష్పాలు అనాసపండ్ల వలె చూసేదానికి మగపుష్పాల కంటే చాలా భిన్నంగా ఉంటాయి.




మగ పువ్వులు




**కాయలు**

* ఆడపువ్వులు పరపరాగ సంపర్కానంతరం పండ్లుగా తయారవుతాయి. అవి ముదురాకు పచ్చ నుంచి ముదురు పసుపు, నారింజ రంగులోకి మారతాయి.

* ఇవి చూడటానికి అనాసపండు లాగా ఉంటాయి. అందుకే 'పైన్' అన్న పేరు వచ్చింది.

* దీని పళ్ళని వివిధ ప్రాంతపు ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారు. వీటిని కూరలా వండి తింటారు. థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్ దేశాలవారికి ఇది అత్యంత ఇష్టమైన వంటకాల్లో ఒకటి.



* ఈ పళ్లని తినటం వల్ల నోరు శుభ్రపడుతుంది. ఎలాగంటే ఈ పండ్లలోని సన్నని పీచుపదార్థం మన పళ్ళ మధ్యన ఇరుక్కున్న ఇతర ఆహార పదార్థాలని తొలగిస్తుంది.



* ఈ పళ్లని మనుషులే కాకుండా ఏనుగులు, గబ్బిలాలు, పక్షులు, ఎలుకలు, తొండలు, ఉడతలు, పీతలు, పలు క్షీరదాలు, వివిధ క్రిమి కీటకాలు ఆహారంగా స్వీకరిస్తాయి.











పండిన కాయలను వెదుకుతూ వచ్చే ఇన్నిరకాల జంతువులను ఆహారంగా స్వీకరించేందుకు పాములు వస్తాయి. ఇవి దాక్కుని ఆహారాన్ని వేటాడటానికి మొగలి కొమ్మలు, ఆకులు చాలా అనువుగా వుంటాయి. ఈ కారణం చేతనే మొగలిచెట్ల పొదల్లో తరచూ పాములు తారసపడుతూంటాయి.

మొగలిచెట్టు అనగా మనకు పాములే గుర్తుకువస్తాయి. అయితే ఇవి పువ్వుల సువాసనకోసం వస్తున్నట్లు మనం అపోహపడతాం. కానీ ఇవి మాత్రం ఆవాసం, ఆహారం కొరకు అక్కడకు చేరతాయి.

కాబట్టి ఈ చెట్లను పెంచే ప్రాంతాల్లో మన రక్షణ కొరకు పలు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం వుంది. ఈ చెట్ల మొదళ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూండాలి. ఎండుటాకులను తొలగిస్తూండాలి. పరిసర ప్రాంతాలను కూడా పొదలు చెత్తరాళ్ళ గుట్టలు వంటివి లేకుండా చేసినట్లయితే ఇటువంటి విషజంతువులు మన మధ్యకు వచ్చే అవకాశం చాలా చాలా అరుదు.

**మొగలిచెట్టు – పాములు రెండు అవసరమే**

ఈమధ్యకాలంలో మొగలిచెట్లను అందం, సువాసన కొరకు తోటల్లో కూడా పెంచుతున్నారు. అయితే పట్టణప్రాంతాలు, జనవాసాల మధ్యకు ఈ జంతువులు, పాములు వచ్చే అవకాశం చాలా తక్కువ. ఇంకా చెప్పాలంటే మనమే వాటి ఆవాసాలను ఆక్రమించి, అవి నిలువ నీడలేక, ఆహారం దొరకక తచ్చాడుతూ మన కంటపడినప్పుడు, విచక్షణారహితంగా వాటిని సంహరించి, అవి అంతరించిపోయే పరిస్థితులను తీసుకువస్తున్నాం. ఇటువంటి చర్యలు మనం కూర్చున్న కొమ్మను మనమే ఖండిస్తున్నట్లుంటుంది.

కొద్దిగా అవగాహన, బాధ్యతతో మనకి అందుబాటులో వున్న





స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు రప్పించడం మన చేతుల్లోనే వుంది. మన తక్షణ సురక్షితమే ధ్యేయం కాకుండా మన భవిష్యత్ తరాలవారి మనుగడ కొరకు పాములు, ఇతర జీవులు కూడా సురక్షితంగా వుండవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

### భూమిపై పాములే లేకపోతే

భూమిపై పాములే లేకపోతే, మనం పండించిన ఆహారధాన్యం మనకి దక్కే అవకాశం తగ్గిపోతుంది. ఎందుకంటే పాముల ముఖ్య ఆహారమైన ఎలుకల సంతతి యొక్క నియంత్రణ లోపించి, అవి బహు కొద్దికాలంలోనే కుప్పలు తెప్పలుగా పెరిగి, ఆహార పదార్థాలు మనకి చేరే లోపలే వాటిని హరించివేస్తాయి. పాములు, ప్రతి జీవి కూడా వాటి వాటి స్థానాల్లో సురక్షితంగా వున్నప్పుడే పర్యావరణం సమతుల్యతతో వుంటుంది. అందరూ అన్నీ బాగున్నప్పుడే మనం కూడా బాగుంటాం. భూమి, దానిపైన జీవజాలం పదికాలాల పాటు చల్లగా వుంటుంది. మరి ఇదే మన సంస్కృతి మనకి నేర్పించిన 'లోకాన్ సమస్తా సుఖినోభవంతు' అంటే.

మనం మొగలి పువ్వులతో ఆ తల్లిని ఎంత భక్తిప్రపత్తులతో పూజిస్తామో, అంతే శ్రద్ధ బాధ్యతలతో పాములను సంరక్షించి వాటి స్థానాలకి చేరుస్తామో అటువంటి రోజున మనం ఏమీ కోరకనే ఆ చదువుల తల్లి, ప్రకృతిమాతల అనుగ్రహం మనపై సంపూర్ణంగా ఉంటుంది. వాటిని గుర్తించి కృతార్థులవటం మన దృష్టి కోణంలోనే వుంది.

సందర్భం వచ్చింది కనుక ఈ క్షణం మనం ఈ వ్యాసాన్ని చదివి అవగాహన చేసుకొని, గుర్తుంచుకొని, తిరిగి మననం చేసుకొని వేరొకరితో పంచుకోగలుగుతున్నామంటే, అదంతా ఆ చల్లని చదువుల తల్లి అనుగ్రహం మనపై మెండుగా వుండబట్టే. ఇవి లోపించి బాధపడేవారు ఈ లోకంలో ఎందరో.

*వాగ్దేవీ! నీకివే నా హృదయపూర్వక సహస్రకోటి ప్రణామాలు!!*

*గమనిక : ఔషధులను వైద్యునిసూచన మేరకు వినియోగించ మనవి.* *(సశేషం)*